క్లుప్తంగా

సచివాలయ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్న సచివాలయ ఉద్యోగాలకు ప్రకాశం జిల్లా మాదిగ జన సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు గంగవరపు విజయ్ భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగిన నిరుద్యోగ మాదిగ యవత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెరిట్ ప్రతిపాదికన నిర్వహించనున్న ఈ శిక్షణకు సంబంధించిన వివరాల కోసం ఆసక్తి గల అభ్యర్థులు 9949502945కు ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

నాగులుప్పలపాడు: కిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో అమ్మనబ్రోలు గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించినట్లు కిమ్స్ ఆసుపత్రి పీఆర్‌వో షేక్ రఫి తెలిపారు. సోమవారం అమ్మనబ్రోలులో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బత్తుల రవీన ప్రారంభించారు. కంటి, గుండె , సాధారణ వైద్యానికి సంబంధించిన 250 మందికి పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు కోయి హనుమయ్య, వైఎస్సార్ సీపీ నేతలు కంచర్ల సుధాకర్, ఉన్నం శ్రీనివాస రావు, బత్తుల కొండయ్య పాల్గొన్నారు.

లారీ ఓనర్ల ఆధ్వర్యంలో చలివేంద్రం

చీమకుర్తి: మండల లారీ ఓనర్స్ ఆధ్వర్యంలో ఎస్సై ఆంజనేయులు చేతుల మీదుగా సోమవారం మర్రిచెట్లపాలెంలో చలివేంద్రం ప్రారంభించారు. అప్పుడే ఎండలు మండిపోతున్న కారణంగా లారీల సిబ్బందితో పాటు స్థానిక ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

తాత్కాలిక సర్పంచ్ బాధ్యతల స్వీకరణ

తాళ్లూరు: విఠలాపురం తాత్కాలిక సర్పంచిగా షేక్ మహబూబ్‌బీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సర్పంచ్ మారం ఇంద్రసేనా రెడ్డి 3నెలల పాటు సస్పెండ్ కావటంతో ఆయన స్థానంలో ఉప సర్పంచిగా ఉన్న ఆమెకు బాధ్యతలు అప్పగించారు. ఈఓఆర్డీ ఎస్‌యూ ప్రసన్నకుమార్, గ్రామ కార్యదర్శి నూరుల్లాను మహబూబ్‌బీ బాధ్యతలు అప్పగించి రికార్డుల్లో సంతకాలు చేయించారు. కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా, మల్కాపురం సర్పంచి వలి, షేక్ బుడే, ముండ్లమూరు మస్తాన్, బుడే సాహెబ్, మస్తాన్, కాశిం వలి, గోళ్లపాటి చిన ఏసు తదితరులు పాల్గొన్నారు.

పేర్నమిట్టలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పాల్గొన్న 1990-91 బ్యాచ్ విద్యార్థులు

చీమకుర్తి: పేర్నమిట్టలోని బీవీ సుబ్బయ్యా పాఠశాలలో 1990-91 విద్యాసంవత్సరం పదో తరగతికి చెందిన విద్యార్థుల సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఆ నాడు వారికి విద్యనందించిన గురువులు నల్లూరి కృష్ణారావు, కేవీ శేషయ్య, ఆర్ చౌదరి, మోహన్ రావు, గోవర్ధన్‌లను ఘనంగా శాలువాలు కప్పి సత్కరించారు. దాదాపు 30 సంవత్సరాల తర్వాత ఇలా కలుసుకోవడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

హెల్త్ క్లినిక్‌లతో ఉపయోగం

అల్లూరు (కొత్తపట్నం): అనీమియా పరీక్షలపై అనీమియా మానిటరింగ్ పర్యేక్షణా అధికారి పాల్ ఆరా తీశారు. అల్లూరులో ఉన్న హెల్త్ క్లీనిక్ సెంటర్లను సోమవారం తనిఖీ చేశారు. హెల్త్ క్లినిక్‌లు వల్ల ఎంతో మందికి వైద్య సేవలు అందుతున్నాయన్నారు. డీపీహెచ్‌ఎన్‌వో సుగుణమ్మ, డిప్యూటీ డీఎంహెచ్‌వో మాధవీలత పాల్గొన్నారు.

గ్రానైట్ రాయి పడి యువకుడి దుర్మణం



గ్రానైట్ రాయిపడి మరణించిన ప్రసాద్ గౌడ్

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లోని ఎస్‌ఈజెడ్ (సెజ్)లో గ్రానైట్ రాయి పగగి యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మధ్యాహ్నం వెలుగు చూసింది. సెజ్‌లోని రేర్ రాక్స్ ఫ్యాక్టరీలో పాలిషింగ్ యూనిట్‌లో పని చేస్తున్న శ్రీపాద్ గౌడ్‌గా గుర్తించారు. ఇతను బూరేపల్లి పునరావాస కాలనీలో నివాసం ఉంటున్నాడు. శ్రీప్రసాద్‌పై రాయి పడిపోవడంతో ఘటనా స్థలంలోనే మరణించాడు. మద్దిపాడు ఎస్‌ఐ శ్రీరామ్ కేసు నమోదు చేసి విచారిన్నారు.

కనులపండువగా గ్రామోత్సవం



నరనందివాహనంపై రామలింగేశ్వరస్వామి



రావణబ్రహ్మ వాహనంపై కన్నేశ్వరస్వామి



గజ వాహనంపై జ్వాలాముఖి అమ్మవారు



గరుడవాహనంపై కోదండరామస్వామి

మడనూరు (కొత్తపట్నం): మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని గంగా పర్వతవర్ధని సమేత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం అర్ధరాత్రి నాలుగుదేవుళ్ల గ్రామోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా రామలింగేశ్వరస్వామి, కన్నేశ్వరస్వామి, జ్వాలాముఖి అమ్మవారని ప్రత్యేకంగా అలంకరించారు. నరనంది వాహనంపై రామలింగేశ్వరస్వామి, రావణబ్రహ్మవాహనంపై కన్నేశ్వరస్వామి, ఏనుగు వాహనంపై జ్వాలాముఖి అమ్మవారులను అలంకరించారు. ఈతముక్కలలో ముస్తాబ్ చేసిన గరుడ వాహనంపై అలంకరించిన అనంత కోదండరామస్వామిని ఊరేగించుకుంటూ, బాణసంచా పేలుస్తూ రామలింగేశ్వర ఆలయానికి చేరుకున్నారు. రామలింగేశ్వర స్వామి ఆలయంలో నాలుగు దేవుడులకు పూజలు చేశారు. టెంకాయలు కొట్టి ఆలయం దగ్గరలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఆవరణలో నాలుగు దేవుళ్లను వరుసగా ఉంచారు. మందు చెట్లును చూచి భక్తులు తిలకించారు. రామలింగేశ్వరస్వామి, శ్రీ కోదండరామస్వామి, కన్నేశ్వరస్వామి, జ్వాలాముఖి అమ్మవారలను వరుస క్రమంలో ఉంచి గ్రామోత్సవరం నిర్వహించారు. మేళతాళాలతో, ఊరేగింపుగా మడనూరు బస్టాండ్ సెంటర్ నుంచి ఈతముక్కల బస్టాండ్ సెంటర్, ఈతముక్కల కొన్ని పుర వీధుల్లో తిరిగి రామలింగేశ్వర ఆలయానికి చేరుకున్నారు. గ్రామోత్సవంలో ప్రతి ఇంటి ముందు నిలిచి టెంకాయలు, ప్రసాదం హారతులు ఇచ్చారు. సాయంత్రానికి ఈతముక్కల రామలింగేశ్వర దేవాలయానికి చేరుకున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాటకచేరీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో అన్నదానం చేశారు. ఎండోమెంట్ ఈవో జి.రమణారెడ్డి పర్యేక్షించారు. శాంతిభద్రతల దృష్ట్యా ఎస్సై కొక్కిలగడ్డ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం



ఎమ్మెల్యే బాలినేనికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ఒంగోలు టౌన్: పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని ఒంగోలు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతృత్వంలో మున్సిపల్ కార్మికులు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. బాలినేని మాట్లాడుతూ.. కోవిడ్ సమయంలో తీసుకున్న కార్మికులను అప్కాస్ పరిధిలోకి చేర్చేలా చైర్మన్‌తో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. చనిపోయిన, అనారోగ్యం కారణంగా పని చేయలేని స్థితిలో ఉన్న కార్మికుల బదులుగా వారి కుటుంబ సభ్యులను పనిలోకి తీసుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికులు శశి, పూర్ణ, పద్మ దివ్య తదితరులున్నారు.

మన ఊరు-మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని
జయప్రదం చేయండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పక్కన ఎమ్మెల్యే టీజేఆర్

చీమకుర్తి: ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో చేపట్టనున్న 'మన ఊరు-మన ఎమ్మెల్యే టీజేఆర్' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి చీమకుర్తిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమెతో పాటు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ప్రసంగించారు. గ్రామాల్లోని ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, మా భవిష్యత్తు మీరే జగనన్న వంటి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించటం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24న నాగులుప్పలపాడు మండలం తిమ్మసముద్రంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండలాల కన్వీనర్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్‌లు, జేసీఎస్ కన్వీనర్‌లు, గృహ సారథులు, రేషన్ డీలర్‌లు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ మండల కన్వీనర్‌లు దుంపా చెంచిరెడ్డి, పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖర రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, దుంపా రమణమ్మ, జ్యేష్ఠ శ్రీనివాసరావు, దుంపా యలమందారెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పొగాకుపై పెనాల్టీలు రద్దు చేయాలి



సమావేశం అయిన పొగాకు బోర్డు సభ్యులు, వేలం కేంద్రాల అధ్యక్షులు

ఒంగోలు సబర్బన్: రాష్ట్రంలోని పొగాకు రైతులకు అనధికారిక బ్యారన్స్‌కు సంబంధించిన పొగాకు అమ్మకాలపై పెనాల్టీలను రద్దు చేయాలని పొగాకు రైతులు, రైతు నాయకులు, బోర్డు సభ్యులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పాద వర ప్రసాదుతో పాటు పొగాకు రైతులు, రైతు నాయకులు సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్ర పొగాకు రైతులకు పొగాకు అమ్మకాల్లో పెనాల్టీలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అనాథరైజ్డు బ్యారెన్స్‌కు సంబంధించిన అమ్మకానికి అనుమతించంట కూడా జరిగిందన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు వస్తున్నందున 16 వేల పొగాకు రైతు కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చేందుకు పెనాల్టీలను రద్దు చేశారన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లో కూడా పొగాకు అమ్మకాలపై పెనాల్టీలను పూర్తిగా తీసేయాలని కేంద్రాన్ని కోరారు. బోర్డు ఈడీ, చైర్మన్, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రిని, పార్లమెంటు సభ్యులను కలిసి వినతి పత్రాలను అందజేయాలని సమావేశంలో తీర్మానించారు. మాజీ బోర్డు వైస్ చైర్మన్ పమ్మి భద్రి రెడ్డి, పొగాకు రైతు నాయకులు అబ్బూరి శేషగిరి, రావి మహేష్, వడ్డెళ్ళ వరప్రసాదు, మారెళ్ళ నాగేశ్వరరావు, బండారు రామాంజనేయులు, చెంచురామయ్య, మద్దులూరి నాగేశ్వరరావు, నాగినేని భాస్కర్, పోతుల నరసింహారావు, కొత్తపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



సహజ ప్రసవాలపై సమావేశం నిర్వహిస్తున్న డాక్టర్ల బృందం

ఒంగోలు అర్బన్: సిజేరియన్ సెక్షన్ ప్రసవాలు కాకుండా సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఆడిట్ బృందం డాక్టర్లు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులకు సూచించారు. డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ప్రసూతి చేసే ఆస్పత్రులు, టెస్ట్‌ట్యూబ్ బేబీ సెంటర్‌లను ఆడిట్ బృందం డాక్టర్లు పరిశీలించారు. సోమవారం ప్రశాంతి ఆస్పత్రి (టెస్ట్ ట్యూబ్‌బేబీ సెంటర్), కళ్యాణ్ ఆస్పత్రిలను డాక్టర్ల బృందం పరిశీలించారు. సిజేరియన్ సెక్షన్ చేసేందుకు కారణాలపై ఆడిట్ చేశారు. అన్నీ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో గర్భిణులకు సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు గర్భిణులకు అవగాహన కల్పించి తగిన సూచనలు చేయాలన్నారు. గర్భం దాల్చిన రోజు నుంచి సాధారణ ప్రసవం జరిగేందుకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీనిలో ఆడిట్ డాక్టర్ల బృందం శ్రీదేవి, హరీష, పద్మజ ఉండగా గణాంకాల అధికారి ప్రసాద్, మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు

- 18 ఎంఎల్‌సీ స్థానాల్లో 11 బీసీలకే..
- బీసీలంటే బ్యాక్ బోన్ అని మరోసారి నిరూపించారు
- బీసీ సంఘాల నాయకులు హర్షం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న బీసీ సంఘ నాయకులు

చీమకుర్తి: బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్‌బోన్ అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి నిరూపించారని బీసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం చీమకుర్తిలోని బీసీ సంఘం కార్యాలయంలో మాట్లాడారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని 18 ఎంఎల్‌సీ స్థానాల్లో 11 స్థానాలను బీసీలకు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో అవకాశాలు రాని.. బాగా వెనుకబడిన కులాలైన బోయలు, శెట్టిబలిజ, వాడ బలిజ, వడ్డెర వంటి కులాలకు ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమని సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లాపరిషత్‌లు, కార్పొరేషన్ పదవుల్లో బీసీలకు అగ్రస్థానం కల్పించారని గుర్తు చేశారు. రానున్న చట్ట సభల్లో కూడా బీసీలకు 50 శాతం రిజర్వేషన్‌లను కల్పించాలని కోరుతూ పార్లమెంట్‌లో బిల్లును పెట్టి బీసీలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలవాలని ఆకాంక్షించారు. బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు బత్తుల మల్లికార్జున, పిన్నిక శ్రీనివాసరావు, చల్లా రామమూర్తి, తన్నీరు శివప్రసాద్, రాంబాబు, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆరోపణలపై న్యాయపోరాటానికి సిద్ధం



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్ర

ఒంగోలు టౌన్: బీజేపీని అప్రతిష్టపాలు చేసే కుట్రతోనే తన వ్యక్తిగత వ్యాపారాలను పార్టీకి ముడిపెట్టి తప్పుడు ఆరోపణలు చేసిన వారిపై న్యాయపోరాటానికి సిద్ధంగా ఉన్నానని బీజేపీ జిల్లా కార్యదర్శి రావులపల్లి నాగేంద్ర యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం విష్ణుప్రియ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన పత్రికా సమావేశంలో వివిధ పత్రిల్లో వచ్చిన కథనాలను ఆయన ఖండించారు. తాను గత 30 ఏళ్లుగా బీజేపిలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా కొనసాగుతున్నానని, ఏనాడు తనపై ఎలాంటి ఆరోపణలు లేవని చెప్పారు. వ్యక్తిగతంగా, రాజకీయంగా తనను ఎదుర్కొలేని వ్యక్తులే దొంగచాటుగా దెబ్బతీయడానికి, పార్టీని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, నిజంగా తన వల్ల నష్టపోయి ఉంటే న్యాయపరంగా తనమీద పోరాటం చేయాలని హితవు పలికారు. ఎస్సీ మోర్చా జిల్లా ఇనచార్జి పెముల మోజి, రాష్ట్ర నాయకురాలు పెముల ఉమారాణి, మీడియా ఇన్‌చార్జి ధనిశెట్టి రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఇ-అభ్యాస్ కే శాట్ ప్రతిభా పరీక్ష



పరీక్షకు హాజరైన విద్యార్థులు

ఒంగోలు సబర్బన్: స్థానిక సత్యనారాయణపురంలోని ఆంధ్రా హైస్కూలులో సోమవారం హైదరాబాద్ ఇ- అభ్యాస్ అకాడమీ కలాం సైంటిఫిక్ ఆప్టిట్యూట్ టెస్ట్ ఆదివారం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు కేంద్రాల్లో నిర్వహించిన 9వ రాష్ట్ర స్థాయి పరీక్షలో మూడు నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఓఎంఆర్ షీట్లను ఆంధ్రా హైస్కూలు చైర్మన్ బొమ్మల శ్రీనివాసరావు, శ్రీరామ్ హైస్కూలు చైర్మన్ శ్రీరాముల రెడ్డి, ఈ అభ్యాస్ ఫౌండర్ సీఈఓ డాక్టర్ ఫణి పవన్, వివిధ సంస్థలు చైర్మన్లు, ప్రిన్స్‌పాళ్లు విడుదల చేశారు. బొమ్మల శ్రీనివాస రావు మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి 450 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ అభ్యాస్ అకాడమీ సీఈఓ డాక్టర్ ఫణి పవన్ మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఏప్రిల్ 23న గుంటూరులోని శ్రీ వెంకటేశ్వరా విజ్ఞాన్ మందిరంలో జరిగే అవార్డు ఫంక్షన్‌లో పురస్కారాలు అందిస్తామన్నారు.

వైద్య సిబ్బంది నమ్మకం కలిగించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అంజమ్మ

నాగులుప్పలపాడు: ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిలో కృషి చేసి ప్రజలకు నమ్మకం కలిగేలా కృషి చేయాలని ఎంపీపీ నలమలపు అంపమ్మ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి విధి విధానలపై ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ హోదా కలిగిన ఎంపీపీ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యవసర పరిస్థితులు, ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన సిబ్బందిపై ప్రసంగించారు. సమావేశంలో ఎంపీడీఓ ఏవీ కుమారి, తిమ్మసముద్రం, అమ్మనబ్రోలు, నాగులుప్పలపాడు, పోతవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్నెట్‌తో పుష్కలంగా ఉద్యోగావకాశాలు

ఒంగోలు టౌన్: ఇంటర్నెట్‌కు సంబంధించిన విషయాలపై విస్తృతమైన అవగాహన పెంచుకుంటే ఉద్యోగావకాశాలు వెతుక్కుంటూ వస్తాయని డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.కళ్యాణి అన్నారు. స్థానిక డీఎస్ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ కేంద్రం నిర్వహించిన ఇంటర్నెట్ కోర్సులో శిక్షణ పొందిన విద్యార్థినులకు సోమవారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రతి ఒక్క విద్యార్థిని ఇంటర్నెట్ నాలెడ్జ్ పెంచుకోవాలని ఆమె సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతున్న ఇంటర్నెట్ వినియోగానికి తగినట్లుగా విద్యార్థినులు అవగాహన పెంచుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని జవహర్ నాలెడ్జ్ కేంద్రం కో ఆర్డినేటర్ ఏవీ.రాజ్యలక్ష్మి అన్నారు. యూట్యూబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.కుసుమ కుమార్ సూచించారు. కార్యక్రమంలో జవహర్ నాలెడ్జ్ కేంద్రం మెంటార్ జే.ఎస్.సురేష్ కుమార్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సహకార రంగానికి స్వర్ణయుగం

చీమకుర్తి: రానున్న రోజులు సహకార రంగానికి స్వర్ణయుగమని జిల్లా సహకార శాఖాధికారి పోలిశెట్టి రాజశేఖర్ అన్నారు. సోమవారం చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయం సమావేశం హాలులో ఒంగోలు డివిజన్ పరిధిలోని పీఏసీఎస్‌ల సీఈఓల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పలు అంశాలపై ఒంగోలు డివిజన్ పరిధిలోని పీఏసీఎస్‌ల సీఈఓలకు ఓరియంటేషన్ ప్రోగ్రాం జరిగింది. పీడీసీసీ బ్యాంక్ సీఈఓ కె.రాఘవయ్య, జిల్లా సహకార శాఖలోని పలువురు అధికారులు, పీడీసీసీ బ్యాంక్ సిబ్బంది, పీఏసీఎస్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పరిణయ వస్త్ర ప్రదర్శన



పరిణయ వస్త్ర ప్రదర్శనలో కొనుగోళ్లు చేస్తున్న వినియోగదారులు

ఒంగోలు సబర్బన్: నగరంలో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన వినియోగదారులను ఆకట్టుకుంటోంది. స్థానిక శ్రీ శంకర నారాయణ కళ్యాణ మండపంలో సోమవారం దేశంలోని డిజైనర్ల ఆధ్వర్యంలో ప్రదర్శన జరిగింది. ఫ్యాషన్ ప్రియులు, మగువలు తమకు కావాల్సిని కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారులు మాట్లాడుతూ ఇక్కడ కొలువుదీరిన వస్త్రాలు భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలా చేస్తున్నాయన్నారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు టీవీ రావు మాట్లాడుతూ వివాహ, పండుగలు వంటి శుభాకార్యాల్లో ధరించటానికి ఎంతో అనువుగా ఉన్నాయన్నారు. ఉప్పాడ, కలంకారీ, మంగళగిరి, ప్రింట్ చీరలు, సిల్క్ చీరలు, కాటన్, కాశ్మీర్ సిల్క్, బ్లౌజులు, టాప్‌లు మొదలైనవి లభిస్తాయన్నారు. 22వ తేదీ వరకు ఉంటుందని చెప్పారు.



జేడీ ఆకస్మిక తనిఖీ

మద్దిపాడు: మండలంలోని దొడ్డవరప్పాడు పశువైద్యశాలను జిల్లా పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబీరాణి సోమవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పశువైద్యశాలలో ఉన్న మందులను, నూతనంగా నిర్మిస్తున్న భవనాన్ని పరిశీలించారు. పశువులకు ఇచ్చే దాణామృతం పశుపోషకులకు వివరించారు. రాబోయే వేసవి కాలంలో పశువులకు గడ్డి కొరత తీర్చేందుకు ప్రభుత్వం రూ.395 విలువైన 25 కేజీల దాణామృతాన్ని (టీఎంఆర్)ను 60 శాతం సబ్సిడీతో రూ.162.50లకు అందించడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. పశుపోషకులు రాబోయే వేసవిలో గడ్డి కొరత ఉన్నా టీఎంఆర్‌ను వాడడం వలన పాల ఉత్పత్తి తగ్గిపోకుండా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 2 వేల టన్నుల టీఎంఆర్ దాణాను అందించామని అవసరమైతే మరి కొంత దాణాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆమె వెంట దొడ్డవరప్పాడు పశువైద్యశాల డాక్టర్ సీ మాధవి రెడ్డి పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సమన్యాయం



మాట్లాడుతున్న సివిల్ జడ్జి శ్యాంబాబు

ఒంగోలు టౌన్: సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజలకు సమాన న్యాయ అవకాశాలు కలిగి ఉండాలన్నదే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు అన్నారు. ప్రపంచ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం నగరంలోని బాలాజీ రావు పేటలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ మహిళలకు, షెడ్యూల్ కులాల వారికి, తెగల వారికి, ఇతర అర్హులకు ఉచితంగా న్యాయ సహాయాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రజల న్యాయపరంమైన సమస్యలను తమ దృష్టికి తీసుకుని వస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారిస్తామని చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. న్యాయవాది దేగల రాజేంద్ర ప్రసాద్, న్యాసేవా సహాయకులు పాడిబండ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

13 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు

ఒంగోలు సబర్బన్: రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టవిధంగా 13 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్ మోహన రెడ్డికి దక్కుతుందని ఎస్ఎల్ టీఏ యూనియన్ నాయకులు కొనియాడారు. స్టేట్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎస్‌ఎల్‌టీఏ) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.శివకుమారి, ప్రసన్నాంజనేయులు సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్ర శేఖర రెడ్డికి, తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద రెడ్డికి మద్దతు ఇస్తున్నామన్నారు.

